శ్రీరస్తు

శ్రీ కాలభైరవ అష్టకమ్-భావార్ధముతో

(శ్రీ ఆది శంకరాచార్య విరచితమ్)

శుభమస్తు



అవిఘ్నమస్తు

సేకరణ: కిరణ్ టైప్ ఇనిస్టిట్యూట్, 41-1/8-13A,
గౌతమీనగర్,3వ లైను, కృష్ణలంక, విజయవాడ-520 013.
https://madhirafamily.wordpress.com/

శ్రీ కాలభైరవ అష్టకమ్ - భావార్థముతో

01. దేవరాజ సేవ్యమాన పావనాంఘ్రి పంకజం
వ్యాలయజ్ఞ సూత్రమిందు శేఖరం కృపాకరమ్।
నారదాది యోగిబృంద వందితం దిగంబరం
కాశికా పురాధి నాథ కాలభైరవం భజే॥

ఇంద్రుడు పూజించు పాదపద్మములు కలవాడు, పామును యజ్ఞోపవీతముగా దాల్చినవాడు, తలపై చంద్రుని అలంకరించుకున్నవాడు, దయచూపించువాడు, నారదుడు మొదలైన యోగులచే నమస్కరింపబడువాడు, దిగంబరుడు, కాశీ నగరమునకు అధిపతియైన కాలభైరవుని సేవించుచున్నాను.

ఇంద్రుడి చేత పూజింపబడే పవిత్ర పాద పద్మాలు కలవాడు, పామును యజ్ఞోపవీతంగా ధరించే వాడు, తల మీద చంద్ర వంక కలవాడు, అత్యంత కరుణ గలవాడు, నారదుడు మొదలైన యోగుల చేత స్తుతించ బడేవాడు, దిగంబరుడు అయిన కాశీ క్షేత్ర పాలకుడు కాలభైరవుడికి నమస్కారము.

02. భానుకోటి భాస్వరం భవాబ్ధితారకం పరం
నీలకంఠ మీప్సితార్థ దాయకం త్రిలోచనమ్।
కాలకాల మంబుజాక్ష మక్షశూల మక్షరం
కాశికా పురాధి నాథ కాలభైరవం భజే॥

కోటిసూర్యులవలే ప్రజ్వలించువాడు, సంసార సముద్రమును దాటించు వాడు, ఉత్తముడు, నీలకంఠుడు, కోరికలు తీర్చువాడు, మూడు కన్నులవాడు, యమునికే యముడైనవాడు, పద్మముల వంటి కన్నులు కలవాడు, నాశము లేనివాడు, స్థిరమైనవాడు, కాశీనగరమునకు అధిపతియైన కాలభైరవుని సేవించు చున్నాను.

అనేక సూర్యుల తేజస్సు కలవాడు. జనన మరణ చక్రం నుంచి దాటించి మోక్షాన్ని ఇచ్చేవాడు, నల్లని కంఠము కలవాడు, కోరిన కోరికలు తీర్చేవాడు, మూడు కన్నులు కలవాడు అయిన కాశీ క్షేత్ర పాలకుడు కాలభైరవుడికి నమస్కారము.

03. శూలటంక పాశ దండ పాణిమాది కారణం
శ్యామకాయ మాదిదేవ మక్షరం నిరామయమ్।
భీమవిక్రమం ప్రభుం విచిత్ర తాండవప్రియం
కాశికా పురాధి నాథ కాలభైరవం భజే॥

శూలము - టంకము - పాశము - దండము అను ఆయుధములను చేతులలో ధరించినవాడు, అన్నిటికీ ఆదికారణమైనవాడు, నల్లని శరీరముకలవాడు, ఆదిదేవుడు, నాశములేనివాడు, దోషములంటనివాడు, భయంకరమైన పరాక్రమము కలవాడు, సమర్థుడు, విచిత్రమైన తాండవమును ఇష్టపడువాడు, కాశీనగరమునకు అధిపతియైన కాలభైరవుని సేవించుచున్నాను.

త్రిశూలాన్ని ఖట్వాయుధాన్ని వరుణ పాశాన్ని దండాన్ని ధరించినవాడు, ఆది దేవుడు, నల్లని శరీరం కలవాడు, నాశనము లేనివాడు, ఎన్నటికీ తరగనివాడు, భయంకరమైన పరాక్రమం కలవాడు, వింత తాండవం చేసేవాడు అయిన కాశీ క్షేత్ర పాలకుడు కాలభైరవుడికి నమస్కారము.

04. భుక్తిముక్తి దాయకం ప్రశస్తచారు విగ్రహం
భక్త వత్సలం స్థిరం సమస్తలోక విగ్రహమ్।
నిక్వణ న్మనోజ్ఞ హేమ కింకిణీ లసత్కటిం
కాశికా పురాధి నాథ కాలభైరవం భజే॥

భుక్తి - ముక్తులనిచ్చువాడు, ప్రశస్తమైన సుందర శరీరము కలవాడు, భక్తవత్సలుడు, స్థిరమైనవాడు, సమస్త ప్రపంచమును నిగ్రహించువాడు,

నడుమునందు మోగుచున్న అందమైన బంగారు చిరుగంటలు ధరించినవాడు, కాశీనగరమునకు అధిపతియైన కాలభైరవుని సేవించుచున్నాను.

ఇహలోక సౌఖ్యాలను మోక్షాన్ని ఇచ్చేవాడు, గొప్ప అందమైన ఆకారం కలవాడు, భక్తులను బిడ్డలుగా చూసుకునేవాడు, స్థిరంగా నిలిచినవాడు, లోకాలన్నిటిని నియంత్రించేవాడు, ఇంపైన ధ్వనులు చేసే మువ్వల వడ్డాణమును ధరించినవాడు అయిన కాశీ క్షేత్ర పాలకుడు కాలభైరవుడికి నమస్కారము.

05. ధర్మసేతు పాలకం త్వధర్మ మార్గ నాశకం
కర్మపాశమోచకం సుశర్మ దాయకం విభుమ్।
స్వర్ణవర్ణ కేశపాశ శోభితాంగ (మండలం) నిర్మలం
కాశికా పురాధి నాథ కాలభైరవం భజే॥

ధర్మమును రక్షించువాడు, అధర్మమును నాశనం చేయువాడు, కర్మపాశములను విడిపించువాడు, సుఖము నిచ్చువాడు, అంతటా వ్యాపించినవాడు, బంగారు వన్నెకల కేశపాశములతో శోభిల్లు నిర్మల శరీరుడు, కాశీనగరమునకు అధిపతియైన కాలభైరవుని సేవించుచున్నాను.

ధర్మ మార్గాన్ని కాపాడుతూ అధర్మ పరులను నాశనం చేసేవాడు, కర్మ బంధాలను నశింపజేస్తూ మంచి శుభాలను అందించేవాడు, బంగారు రంగు శరీరము పై పాముల నే తాళ్లుగా ధరించినవాడు అయిన కాశీ క్షేత్ర పాలకుడు కాలభైరవుడికి నమస్కారము.

06. రత్న పాదుకా ప్రభాభిరామ పాద యుగ్మకం
నిత్య మద్వితీయ మిష్ట దైవతం నిరంజనమ్।
మృత్యుదర్పనాశనం కరాలదంష్ట్ర భీ(భూ)షణం
కాశికా పురాధి నాథ కాలభైరవం భజే॥

కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్

అందమైన పాదములందు రత్నపాదుకలను ధరించినవాడు, నిత్యుడు, అద్వితీయుడు, ఇష్టదైవము, నిరంజనుడు, యముని అహంకారమును నాశనం చేసినవాడు, భయంకరమైన కోరలు ఆభరణములుగా కలవాడు, కాశీనగరమునకు అధిపతియైన కాలభైరవుని సేవించుచున్నాను.

రత్నాల లాంటి పాదరక్షల వెలుగు వల్ల అందమైన పాదాలు కలవాడు, నిత్యుడు, అద్వితీయుడు, అందరికీ ఇష్ట దేవుడు గా ఉండేవాడు, మచ్చలేనివాడు, మృత్యుదేవత గర్వాన్ని నశింపజేసేవాడు, ఆ దేవత భయంకరమైన కోరల నుండి విడిపించేవాడు అయిన కాశీ క్షేత్ర పాలకుడు కాలభైరవుడికి నమస్కారము.

07. అట్టహాస భిన్న పద్మజాండకోశ సంతతిం
దృష్టి పాత నష్ట పాప జాల ముగ్ర శాసనమ్।
అష్టసిద్ధి దాయకం కపాల మాలికా ధరం
కాశికా పురాధి నాథ కాలభైరవం భజే॥

అట్టహాసముతో బ్రహ్మాండములను బద్దలు చేయువాడు, చూపుతో పాపములను తొలగించువాడు, ఉగ్రముగా శాసించువాడు, అష్టసిద్ధులను ప్రసాదించువాడు, కపాలమాల ధరించినవాడు, కాశీనగరమునకు అధిపతియైన కాలభైరవుని సేవించుచున్నాను.

బ్రహ్మాండాల సమూహాన్ని తన అట్టహాసంతో పేల్చి వేసే ప్రళయకారకుడు, తన కనుచూపు మాత్రం చేత పాపాలను నశింప చేసేవాడు, కఠినంగా క్రమ శిక్షణ చేసేవాడు, అణిమ, మహిమ మొదలైన ఎనిమిది సిద్ధులను అందించేవాడు, పుర్రెల దండ ధరించేవాడు అయిన కాశీ క్షేత్ర పాలకుడు కాలభైరవుడికి నమస్కారము.

08. భూత సంఘనాయకం విశాలకీర్తిదాయకం
కాశివాసిలోక పుణ్యపాప శోధకం విభుమ్।

నీతిమార్గ కోవిదం పురాతనం జగత్పతిం
కాశికా పురాధి నాథ కాలభైరవం భజే॥

భూతనాయకుడు, విశాలమైనకీర్తి కలిగించువాడు, కాశీలో నివసించువారి పుణ్య పాపములను శోధించువాడు, సర్వవ్యాపి, నీతిమార్గపండితుడు, పురాతనుడు, ప్రపంచరక్షకుడు, కాశీనగరమునకు అధిపతియైన కాలభైరవుని సేవించుచున్నాను.

భూతాల సైన్యానికి నాయకుడైనవాడు, లోకమంతా వ్యాపించే కీర్తిని కలిగించేవాడు, కాశీలో స్థిరపడే లోకుల పాప పుణ్యాలను శోధిస్తూ వాళ్ళకు తగిన పుణ్య ఫలాన్ని అందించేవాడు, నీతి మార్గమును ఎరిగిన పండితుడు, అత్యంత ప్రాచీనుడు, లోకాలన్నిటికి అధిపతి అయిన కాశీ క్షేత్ర పాలకుడు కాలభైరవుడికి నమస్కారము.

ఫల శ్రుతి

09. కాలభైరవాష్టకం పఠన్తి యే మనోహరం
జ్ఞానముక్తి సాధ(కం)నం విచిత్ర పుణ్యవర్ధనమ్।
శోక మోహ లోభ దైన్య కోప తాప నాశనం
తే ప్రయాన్తి కాల భైరవాంఘ్రి సన్నిధిం ధ్రువమ్॥

మనోహరమైనది, జ్ఞానమును, ముక్తిని కలిగించునది, అనేక పుణ్యములను పెంపొందించునది, శోకము – మోహము – దీనత్వము – కోపము – పాపములను నశింపచేయునది అగు కాలభైరవాష్టకము పఠించు వారు నిశ్చయంగా కాలభైరవ పాదసన్నిధిని చేరెదరు.

ఎవరైతే – అందమైన, జ్ఞానాన్ని–మోక్షాన్ని అందించే, కొంగ్రొత్త పుణ్యాన్ని పెంచే, దుఃఖాన్ని–వ్యామోహాన్ని–దీనత్వాన్ని–లోభి గుణాన్ని–కోప స్వభావాన్ని–కష్టాన్ని నాశనం చేసే ఈ కాలభైరవ అష్టకాన్ని ప్రతి దినము చదువుతారో వాళ్ళు తప్పక కాలభైరవుడి పాద సన్నిధికి చేరుకుంటారు. ఇది తథ్యం.

// ఇతి శ్రీ మచ్ఛంకర భగవతః కృతా కాలభైరవాష్టకమ్ సంపూర్ణమ్ //

--- = ---

కిరణ్ టైప్ ఇన్‌స్టిట్యూట్

